కథానిక

# లంచానికి శిక్ష!

ఓగేటి శివరామకృష్ణ

నారాయణమూర్తి చాలా దూరదృష్టిగల యువకుడు. ముందు వెనకలూ, మంచిచెడ్డలూ ఆలోచించకుండా అతడేపనీ చేయడు. అందుకని తననుండి సహాయంపొందే యితరుల కతడు చాలాకాలం వరకూ వుపకారం చెయ్యలేదు, అపకారం చెయ్యలేదు. అందులోనూ అతడు సర్కారుద్యోగంలోచేరి యేడాదిన్నరే అవుత!

చాలామంది ప్రతికక్షులు—అతనికి బయలుదేరారు. అతడికి యేదో ప్రతిఫలం ముట్టచెప్పి తమపని సాగించుకొందామన్న ప్రతిఫలాపేక్ష గలవ్యక్తులే అతడికి ప్రతికక్షులయ్యారు. నారాయణమూర్తిని ఎన్నో విధాలుగా లొంగదీయటానికి వాళ్లు ప్రయత్నించే, విఫలులై అతడిమీద కురకటానికి ప్రయత్నించారు.

ఇంతకీవిచిత్ర మేమంటే నారాయణమూర్తిని లొంగదీసుకోలేని ఆ వ్యక్తులు కుట్రపన్నుతున్న సమయంలోనే యితడు లంచం తీసుకోవటం తటస్థించింది!

నారాయణమూర్తి లంచంతీసుకొన్నది రెండు వందల యేభైరూపాయలుమాత్రం.

ఆ లంచం తీసుకొని అవతలవ్యక్తిపని పూర్తి చేశాడు! ఈలాంటి లంచాలు యెంతోమంది—యెవరికీ తెలియకుండా చప్పుడు కాకుండా తీసు తీసుకొంటూనే ఉంటారు. కాని అవి అలా బైటకు పొక్కవు.

కాని నారాయణమూర్తిదటువంటిది కాదు. పొక్కింది; పొక్కటం యేమిటి— వూరూ, వాడా డప్పుకొట్టి యాగీచేసినట్లయింది. నారాయణమూర్తిసంగతి అంతా చెప్పుకొంటూంటే వంచినతల తిరిగి యెత్తలేక పోయాడు. వెధవ బ్రతుకు బ్రతుకున్నానా అనిపించిందతనికి.

ఒకపట్టాన లంచంపుచ్చుకోటానికి తానంగీకరించలేదు ..తనకా ఇంకా వివాహం గట్రా అవలేదు. అందువల్ల అధిక ఆదాయంతో నిమిత్తం లేదు. తండ్రి భగవంతుడి దయవల్ల యెదోకాస్తో కూస్తో సంపాదించుకున్నాడు, ఈ విధమైన వుద్దేశంతోనే నారాయణమూర్తి వాటిజోలికి పోలేదు.

కాని యింట్లో 'లంచం' సంగతి ఆరని అగ్ని అయింది. తండ్రి చేస్తున్నది వుత్కృష్టమైన వుపాధ్యాయవృత్తి. ఆయనస్వార్థంకోసం పాకులాడకుండా తన వృత్తిగౌరవం—నలుగురివద్దా నిలబెట్టుకొని అందరిచేతా ఒహో అనిపించుకొంటున్నాడు.

తండ్రికి అక్కరగా తాను బయలు దేరటం వల్ల, యేదో తాను సంపాదించు తూండటం వల్ల లోటు లేకుండా కుటుంబం సాగిపోతోంది.

అయితే అంతటితో కుటుంబం హాయిగా జీవించుతూన్నందుకు వీలులేకుండా వుంది. ఇంట్లో తానూ, తనచెల్లెలూ, వివాహం చేసుకోవలసి వున్నారు. తాను వుద్యోగంలో చేరిన కొత్తలో వివాహం చేసుకోమని నిర్బంధిస్తే— మరో సంవత్సరం గడిచాక చేసుకొంటానన్నాడు. సంవత్సరం గడచింది. తాను మరో సంవత్సరానికి వాగ్దానాన్ని పోస్టుపోను చేశాడు.

తల్లికి ఓపిక నశించింది. నువ్వు వివాహం చేసుకోకపోతేమానె చెల్లెలు సంగతయినా చూడద్దా" అందామె ఒకదినం. తండ్రిగూడా ఆపూట ఇంట్లోనే వున్నాడు. ఆయనగూడా ఔనన్నట్లుగా తనవయిపు చూశాడు.

"అయితే యేమిటి?"— అయోమయంగా ప్రశ్నించాడు.

"మంచిసంబంధం చూసి పెళ్ళిచేయాలి"— తల్లి అంది.

"అవును!" అన్నాడు తను!

తండ్రి యెందుకో నవ్వాడు. ఆనవ్వెందుకో అప్పటికి తనకర్థం కాలేదు. తరువాత అర్థమైంది.

"మంచిసంబంధం అంటే రెండుమూడు వేలయినా వుండాలి" తండ్రి దూరాలోచనచేస్తూ అన్నాడు.

"రెండుమూడు వేలే! మనం తూగగలమా?" ఆశ్చర్యంగా అన్నాడు తను.

"నువ్వు తలచుకొంటే యెంతరా!" అంది తల్లి.

"అవునన్నట్లుగా"—ఆశగా— తనభవిష్యత్తు కోరుతూ చిట్టి తనవయిపు చూసింది.

"మొత్తం నాల్గువేలయితే చక్కగా చిట్టిని మంచిసంబంధంచూసి పెళ్ళిచేసేయచ్చు"—తండ్రి ఆకాశ సౌధాలునిర్మించు కొంటున్నాడు.

"నాల్గువేలు...ఎక్కడ్నించి తెస్తాం. ప్రస్తుతానికి ఆ వుద్దేశంగూడా విరమించుకోటం మంచిదేమో!" తనలాగ వయసొచ్చిన చెల్లెలు బ్రహ్మచర్య ఆశ్రమస్వీకరణచేస్తే బాగుంటుం దనే తలంపుతో అన్నాడు తాను.

"ఏడిసినట్లేవుంది తెలివి." తండ్రి కసురుకున్నాడు. చెల్లెలు తెల్లబోతూ తన వయిపు చూసింది.

"రోజురు రోజు ముందుకు పోతూ ంటే మతి సన్నగిల్లుతోంది. నీలా పెళ్ళిచేసుకోకుండా ఆడదాన్ని యింట్లో యెంతకాలముంచుతార్రా" తల్లి కస్సుమంది.

"ఏదో సంబంధం చూడాలిగాని, అలాంటి తెలివితక్కువమాటలు మాటాడ గూడదు"—తండ్రి అన్నాడు.

తానుమరి ప్రతిఘటించలేక పోయాడు "సరే మరయితే యేంచేయాలి?"

"ఏం చేయాలేమిటి డబ్బుసంగతి చూడాలి" తండ్రి అన్నాడు.

"ఒకటి రెండువేలు మన పలుకుబడినిబట్టి యెవర్నైనా అప్పడిగి తీసుకురావచ్చుగాని—యేకంగా నాలుగువేలు యెవరిస్తారు?" తెలివితక్కువతనం వెల్లడిచేస్తూ అన్నాడతను.

"అప్పా!"—తండ్రి ఆశ్చర్యపోయాడు.

"అప్పుచేసి...నిన్ను చేయమనటం లేదోయ్" తల్లి అంది.

"మరి?"—తానన్నాడు.

"ఇంత వయసొచ్చినా నీ తెలివితేట లాలేగా ఉన్నాయ్! వయసులో నున్న వాడవ్...సంపాదించగల ఉద్యోగం...తలచుకుంటే...నాలుగు వేలుకాదు...పదివేలు సునాయాసంగా...ఎంత మందో యిప్పటికి యెన్నోమార్లు నిన్నుగురించి మీనాన్నతో నిష్ఠూరంగా చెప్పారు. వాళ్ళు చెప్పటం యేమిటి—అందులో మన స్వార్థం లేకుండా వుంటుందా? చేతిలోపని కానిచ్చేస్తే మునిగిపోయిందేమిటి..." తల్లి ఏ మే మో చె ప్పి తన అభిప్రాయాన్ని తెలియపరచింది. తాను తెల్లబోతూండగానే తండ్రి అందుకున్నాడు.

"దీపం వుండగానే యిల్లు చక్కపెట్టుకోవాలి నాయనా. నీతో నే చెప్పగూడదు. నా వృత్తి ధర్మం దాన్ని ద్వేషిస్తుంది, గంజీఆన్నానికి గూడా సరిపోని జీతం డబ్బులతో జీవించేమనం—వృత్తి ధర్మాన్ని పునస్కరించుకొనిపోతూ పెళ్ళిళ్ళు యెలాచేసుకో గలుగుతాం. యేలా చేయగలుగుతాం. నేను దాన్ని ప్రోత్సాహ పర్చను. కాని సమయం—మరిలాంటి అదను మరిలభ్యంకాదు. ఏదో నాలుగురాళ్లు సంపాదించే యీసమయంలో నీచెల్లెల్ని ఒక గొప్పయింటివాళ్ళ కోడలు చేయటానికి మరినువ్వు నీ స్వార్థం వుపయోగించుకోటం తప్పదు. నే చెప్పగూడని మాటలు నా వృత్తి ధర్మానికి వ్యతిరేకమైన మాటలూ చెబుతున్నా, అయినా ఒకసంగతి గ్రహించి నువ్వు ముందడుగు వేయి. ఈదినంలాగ రేపుండదు. నేడున్నట్లు రేపుండం, అందువల్ల..." అని యింకా యేమేమో.

తాను తెల్లపోయాడు, మరావిషయం ఆలోచించ లేకపోయాడు గూడాను; ఎదుట జాలి కొలిపే వదనంతోఉన్న చిట్టి తనచేత యెదురు చెప్ప నివ్వలేదు! "అలాగే మీ యిష్టప్రకారం చేస్తాను నాన్నా!" అన్నాడు తాను.

తల్లి మొఖంలో ఆనందం వెలిసింది!

చిట్టి చిరునవ్వు నవ్వింది!

తండ్రి కళ్ళల్లో నీళ్లు నిల్చాయి.

తాను ప్రస్తుత విద్యుక్త ధర్మాన్ని గురించి ఆలోచించి, నిర్ణయానికి వచ్చాడు. "దైర్యే సాహసీ లక్ష్మీ"—అనుకొంటూ రెండువందల యేభైరూపాయ లంచంతో బోణీకొట్టాడు!

లంచం సొమ్ము—చేసినపనికి తగ్గదికాదు. ఆ సంగతి పనిచేసిన తనకీ ప్రతిఫలం పొందిన అవతల వ్యక్తికీ తెలుసు! కానయితే ఫలితంమాత్రం చేస్తూంది పరిమళంవిధంగా. గుప్పుమని వూరూ వాడా తెలిపోయింది.



ఇందేళ్లక్రిందటా, నీవు వచ్చేసరికి యెండుకపోయి పుల్లలా వున్నానా—నీలానే వొక ఇల్లాలువచ్చి. నన్ను చూచి అయ్యో అని విచారించి, పలానిమందు పుచ్చుకోమన్నది. సరే,—యెన్ని త్రాగలేదుగనుక!— వాటిలో యిదొకటి అని తెప్పించాను. ఒకే సీసాతో గుణం అగుపడింది వదినా! ఆ మాయజబ్బు యెక్కడికిపోయిందో! నాకు యెప్పటి ఆరోగ్యమూ వచ్చింది. మా కోరికలూ ఫలించాయి.

## స్త్రీల ఋతుదోషనివారణకు
## ఆరోగ్య రక్షణకున్ను సంతాన సఫలతకు




# లోధ్ర

కేసరికుటీరం లిమిటెడ్, రాయపేట, మద్రాస్

ఆలా జరగటంవల్ల ఫలితం—ప్రతికక్షుల కుట్ర ఫలించటం, తనను వుద్యోగంనుంచి తాత్కాలికంగా వుూస్టుచేయటం, అంతేకాకుండా పై అధికారివద్దకు వెళ్ళి తగిన సమాధానం యివ్వటం.

ఇదంతా నారాయణమూర్తికి తెచ్చి పెట్టుకొన్న తద్దినం విధంగావుంది.

నారాయణమూర్తిని గురించి, వూరూవాడా అనేకవిధాలుగా అనుకొన్నారు. నారాయణమూర్తి స్వతహాగా మంచివాడే అయినా యీ ఒక్కపనితో అతడు జూదరి, ముండల మరాకోరు, త్రాగుడు త్రాగేవాడు పొగరుబోతూను; ఒకప్పుడు నారాయణమూర్తంతటి చక్కనివ్యక్తి వుద్యోగధర్మాలు సక్రమంగా నిర్వర్తించుకొనే మనిషీ లేడన్న ప్రజే పై వాక్యాలు దొర్లిస్తోంది. "చెప్పేవి శ్రీరంగనీతులు చేసేవి దొమ్మరిపనులు" సామ్యంగూడా నారాయణమూర్తికోసం వుపయోగపడింది.

* * *

"లంచం" తీసుకొన్న నారాయణమూర్తిని అభినందించిన మిత్రులు—తాత్కాలిక వుూస్టింగుతో, అతడిముఖం చూడ్డంగూడా మానుకొన్నారు. అతడు బజారున నడుస్తూ ప్రేలెత్తి చూపుతున్నట్లూ యెవళ్ళో వెక్కిరిస్తూన్నట్లు భావించి బాధపడేవాడు, ఎవరయినా నవ్వితే తన్ను గురించి అనుకొనేవాడు.

ఉద్యోగ యేవలోపడి, నిద్రాహారాలుమాని తెగపనిసేచేవాడు. ఇంట్లో కూర్చొనటం అసలలవాటే లేదు, మరి వూరిలో తిరగలేకపోతున్నాడు. ఏదో క్షోభపడుతున్న వాడివిధంగా—నారాయణమూర్తి కనిపిస్తున్నాడు

ఇంట్లో కడుపునిండుగా యెవరూ భోజనాలు చేయటంలేదు. "పాపిష్టిదాన్ని యేనోట ఆమాట అన్నానో"—అని తల్లి ప్రతీనిత్యం కళ్ళనీళ్ళు పెట్టుకొంటూనే వుంది.

తండ్రి, బాధ వ్యక్తపరచకపోయినా యింట్లో "కస్సుబుస్సు" మంటున్నాడు. ఆయన పరువు ప్రతిష్ఠలకి ఒక దెబ్బకదా!

చిట్టి మొఖం దిగాలు పడిపోయింది. తనమూలకంగా అన్నయ్య వుద్యోగం పోయిందని, చాటుమాటున ఆమె యేడుస్తూనే ఉంది.

ఈలా పరిస్థితి విషమించి రోజులు గడుస్తూండగానే నారాయణమూర్తి, తన అధికారి వద్దకు బయలుదేరి జవాబు చెప్పుకోవలసిన రోజు వచ్చింది. తల్లితండ్రులకు యేదో ధైర్యంచెప్పి, బయలుదేరాడు, ఆఫీసరుగారి నగరానికి నారాయణమూర్తి.

* * *

గుండె దడదడలాడుతూంటే తన భవిష్యత్తేమవుతుందో అని భయపడుతూ, అధికారి ఆఫీసు చేరుకొన్నాడు నారాయణమూర్తి ఉదయము పదకొండుగంటలకొచ్చిన అతడికి మధ్యాహ్నము రెండుగంటల కాయన దర్శనంఅయింది. అప్పటివరకూ ఆఫీసు బయటనున్న చెట్టునీడను కూర్చుని యేలా జవాబు చెప్పటమా..., తన వుద్యోగా న్నెలాగ రక్షించుకొనటమా అని ఆలోచిస్తూ ఉండిపోయాడు నారాయణమూర్తి.

సరిగ్గా రెండుగంటలకు, ఆఫీసరు దగ్గరనుంచి కబురొచ్చింది. వణుకప్పుడే అతనిలో ప్రవేశించింది. కళ్ళల్లో నీళ్లు నిల్చాయి. భయపడుతూ ఆఫీసరు ముందునకొచ్చిన నిల్చున్నాడతను.

నారాయణమూర్తిని ఆఫీసరు యెగాదిగా చూశాడు.

ఫక్కున నవ్వాడు.

నారాయణమూర్తికి తల కొట్టేసినట్లయింది.

పిల్లికి చెలగాటం యెలుకకు ప్రాణపోకటం గదా!

"ఏమయ్యా నీ పేరు?"

"నారాయణమూర్తండి."

"ఎంతవరకూ చదివావ్?"

"బి.ఏ వూర్తిచేశానండి."

"మనలో మాట రహస్యం దాచకు...నువ్వు వుద్యోగంలో ప్రవేశించి ఏడాదిన్నరేగా అవుత?"

"నీకు పెళ్ళవలేదు కదూ!"

"లేదండి."

"లంచం పుచ్చుకొన్న మాట నిజమేకదూ?"

వెకిలినవ్వు నవ్వుతున్నాడాయన.

నారాయణమూర్తి తికమక పడుతున్నాడు. చెప్పకుండా మాటల్లో తన్ను తారక్షించుకో గలడా! నిజంచెప్పి పొరపాటు జరిగినదని క్షమాపణ కోరితే, కొంత కాలం సస్పెండుచేసినా, వుద్యోగం వుంటుందికదా? ఏంచేసేది? నారాయణమూర్తి యింకా ఆలోచిస్తూనే వున్నాడు.

"ఏమయ్యా!"

నారాయణమూర్తి చుట్టుప్రక్కల కోకమారు చూశాడు. తానూ తన అధికారీ తప్పితే మరె వరూలేరు. నిజంచెప్పి క్షమాపణ కోరమని అతడి మనస్సు నొక్కి చెప్పుతోంది.

ఆఫీసరువైపు చూశాడు నారాయణమూర్తి.

"ఏమయ్యా?"

"చిత్తం."

"ఏమిటీ చిత్తం. ఏమంటావ్? నువ్వు లంచం పుచ్చుకొన్నావా లేదా?"

"నిజమేనండి"

"మరి శిక్ష తెలుసాండి?"

"తెలుసునండి. అదియేదో పొరపాటున జరిగి పోయింది. తనుపాటివాడిని వెనకముందు లేమీ లేవండి. ఏదో యీమాటికి క్షమించి నా వుద్యోగము నిలిపి మాకుటుంబాని రక్షించండి."

ఆఫీసరు నవ్వాడు.

"ఏమిటో నిన్నుచూస్తే జాలి కలుగుతోంద య్యా."

"చిత్తం. మరి లోటు ముందుకన్పించదండి."

"మనం పెర్సనల్ గా మాట్లాడుకుందాం! సాయంకాలం అయిదుగంటలకి మాయింటికిరా!"

"చిత్తం" ఉబ్బిపోయాడు నారాయణమూర్తి దూరం ఆలోచన చేయకుండా ఆఫీసులోకంటే విడిగా కలుసుకుంటే తన కనుకూలత యెక్కువ వుంటుందనుకున్నాడతను.

ఆఫీసరును కలుసుకోటానికై నారాయణమూర్తి వాళ్ళింటికి అనుకొన్న వేళకు చేరుకొన్నాడు. లోపలి కెళ్ళటానికి సంకోచిస్తూ, వీధిలో తానట్లాడుతోంటే "ఎవరికోసం?"— అంటూ పద్దెనిమిదేళ్ల యువతి బైటకొచ్చి తొంగి చూసింది.

ఇద్దరి కళ్ళూ ఒకసారి కలుసుకొన్నాయ్.

నారాయణమూర్తి, తడుముకుంటూ, "ఆఫీసరుగారికోసం" అన్నాడు.

"ఇప్పుడే వచ్చారు. లోనికి రండి."

"చిత్తం" అంటూ భయపడుతూ లోపలి కొచ్చి, వరండాలో నిల్చున్నాడతను.


మై కాఫీ

సువాసనకు
ప్రత్యేకత కమ్మదనానికి
తాజాతనానికి

¼ పౌను, ½ పౌను, 1 పౌను-ప్యాకెట్లలో దొరుకును.
ఇంకా 3 పౌ॥, 7 పౌ॥, 20 పౌ॥ టిన్నులలో సైతం దొరుకును.
వాక్యూం ప్యాకింగు చెయ్యబడిన 1 పౌను టిన్ను ఒక ప్రత్యేకత.

ఏజెంట్లు లేని చోట్ల ఏజెంట్లు కావలెను.

త్వరగా యీ క్రింది ఎడ్రసునకు వ్రాయండి:

ఓక్లి బౌడెన్ & కో (మద్రాస్) లిమిటెడ్,
పోస్టుబాక్సు నెం. 67,
మద్రాసు-1.

"నిల్చున్నా రేం? అలా కుర్చీలో కూర్చోండి"

"ఆ...ఆ" తాను తటపటాయించాడు.

ఆ అమ్మాయి నవ్వుతూ, "ఫరవాలేదు. కూర్చోండి మా నాన్న గారితో నే చెబుతాలెండి" అంది.

నారాయణమూర్తికి తల కొట్టేసినట్లయింది.

"అఁ ఎందుకులెండి!" అన్నాడు.

"ఫరవాలేదు" అని ఆమె అనటంతో, తప్పనిసరిగా కుర్చీలో కూర్చున్నాడు. ఇంతట్లో "ఎవరది"-అంటూ ఆఫీసరుగారొచ్చారు.

"నేనండి!" అంటూ కుర్చీలోంచి వినయంగా లేచాడు నారాయణమూర్తి.

"ఆ కూర్చోవయ్యా!" అంటూ నవ్వాడాయన.

ఆ అమ్మాయి వెళ్ళిపోయింది.

"మా అమ్మాయి!"

"చిత్తం."

"మంచి చలకీగా అందరితో మాట్లాడుతుంది."

"ఈ రోజుల్లో అలాగే ఉండాలండి!" తన అనుకూలతకోసం ఆయన కనుకూలంగా మాట్లాడటం ప్రారంభించాడు నారాయణమూర్తి,

"స్కూలుఫైనలు పరీక్ష ప్యాసయింది."

"బాగుందండి."

"మరి చదివించటం, మన బ్రాహ్మల కనవసరం అని మాన్పించాను."

"అంతేనండి,"

"అఁ అమ్మాయికింకా పెళ్ళి కాలేదు."

"చిత్తం!"

"మంచి సంబంధం ఒకటి చూడాలి!"

"చిత్తం!"

"ఏమయినా యీ రోజుల్లో తగ్గ వరుడ్ని చూచి, కట్నం యిచ్చి పెళ్ళిచేయటం చాలా కష్టం."

"అవునండి."

"మనకొచ్చే జీతాలు బియ్యపు గింజలకే చాలవు. ఏమంటావ్ .కాస్తోకూస్తో కక్కుర్తి పడకతప్పదు." నారాయణమూర్తి సందిగ్ధంలో పడ్డాడు; ఏలా జవాబుచెప్పాలో అతడికి తెలియలేదు.

"నాకు తెలుసునండి."

"లంచం" అనేదాన్ని యింతవరకూ నా కళ్ళ చూడలేదు."

"తెలుసునండి."

"ఏదో సాటివాడినంటున్నావ్ కనుక—అభిమానం యేర్పడింది."

"అంతా తమ అనుగ్రహం."

"మనవాళ్ళల్లో మనం సహాయం చేసుకోకపోతే ఏలాగ చెప్పు?"

"అవునండి."

"అందుకని—నువ్వు చేసింది తప్పిదమేఅయినా, ఋజువుపర్చటానికివీలున్నా-నీమీద ముఖ్యంగా సాటివాడవనీ, కావలసినవాడవనీ, ముఖ్యంగా వివాహం అవనివాడవనీ తెలిసి, మరి కేసు జరగకుండా చేతామనుకొంటున్నాను."

"చిత్తం!" అతి వినయం ప్రదర్శించాడుగా నారాయణమూర్తి.

"నువ్వుమాత్రం నా రిక్వెస్టు తీర్చాలి." అదో విధంగా ఆఫీసరతనివైపు చూశాడు.

"చిత్తం."

"మా అమ్మాయికీ యింకా పెళ్ళి కాలేదు. మీరూ మేమూ కావలసినవాళ్ళంగనుక వివాహం చేసుకో."

నారాయణమూర్తి తెల్లబోయాడు.

"అమ్మాయినిగూర్చి... నీకెంతో చెప్పాను. అమ్మాయంటే నీకిష్టంవున్నట్లు నీమాటలు చెప్పాయ్."

"చిత్తం."

"మరి చిత్తం ఏమిటి సరేనను."

"అదికాదండి."

"అదికాదండీ కాదు, యిదికాదండీ కాదు నువ్వుచేసిన తప్పిదాన్ని, కప్పిపుచ్చి, నీ జీవితాంతంవరకూ, కుటుంబపోషణకు మార్గంచూపే, వుద్యోగం, మరల నీకు యిస్తున్నప్పుడు నాకీ మాత్రం సహాయం చేయలేవూ?"

"చిత్తం"

ఇంకేముంది నారాయణమూర్తి, రిజాయినింగ్ ఆర్డరుతో బాటు, సూర్యప్రభతో, అవబోయే తన పెండ్లి శుభరేఖతో యింటికి బయలుదేరాడు.